

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

# రేవంత్‌రెడ్డి.. ఓ ఫ్యాక్షనిస్టు..

- ఓడిపోతాననే భయంతోనే గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నాడు
- ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదు
- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బాధితులకు పరామర్శ

కొడంగల్, నవంబర్ 15 : రేవంత్ ఓ ఫ్యాక్షనిస్టు.. గూండాయిజాన్ని ప్రోత్సహిస్తూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు యత్నిస్తున్నాడని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనులు, భూగర్భవనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కోస్గి మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి కోస్గి మండల కేంద్రంలోని సర్జఖాన్‌పేట, కోస్గి మున్సిపల్ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులపై జరిగిన దాడిని ఖండించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలను భయపెట్టి అడ్డదారిలో గెలిచేందుకు రేవంత్ పథకం పన్నాడని..గతంలో రెండుసార్లు కూడా ఇదేవిధంగా పథకం ప్రకారం దాడులకు పాల్పడి గెలిచిన ఘటనలు ప్రజలకు గుర్తున్నదన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉన్నారని.. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా నెరవేరవన్నారు. ఎవరి ద్వారా సెగ్మెంట్ అభివృద్ధిలో వెనుకబడిందో.. ఎవరి వల్ల శాంతిభద్రతలకు భంగం కలుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని ఈనెల 30న జరుగనున్న పోలింగ్‌లో వారికి సరైన జవాబు చెబుతారన్నారు. గత ఐదేండ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లారన్నారు. వేల కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులతోపాటు.. మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు. నరేందర్‌రెడ్డి హయాంలో సెగ్మెంట్‌లో సుఖశాంతులు నెలకొన్నాయని.. ఫ్యాక్షనిస్టు రేవంత్‌వస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోసారి మా పార్టీ నాయకులపై దాడులు పునరావృతమైతే మాసత్తా ఏమిటో చూపించాల్సి వస్తుందన్నారు.

## సర్జికల్ దాడిలా.. కాంగ్రెస్ దాడి..

సర్జికల్ దాడి అనేది దేశాల మధ్య జరిగే యుద్ధమని.. కానీ, మంగళవారం రాత్రి కోస్గి పట్టణంలో జరిగిన ఘటన సర్జికల్ దాడిని తలపించేలా ఉందని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ ఫసీయుద్దీన్ అన్నారు. శాంతియుతంగా సర్జఖాన్పేటలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటుంటే కాంగ్రెస్ గూండాలు ఎక్కడినుంచో వచ్చి బీఆర్‌ఎస్ నాయకులు వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడికి దిగడంపై మండిపడ్డారు. ఇటువంటి ఘటనలను చూస్తే.. రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టమవుతున్నదన్నారు. దాడి ఘటనపై ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై మళ్లీ రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపర్చడం సరైంది కాదన్నారు. ఈ పరిణామాలను చూస్తుంటే కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నట్లు కనిపిస్తున్నదన్నారు. ఈ ఎన్నికల్లో నూ పట్నం నరేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రావు యాదవ్, రాజేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

## రాముడు లాంటి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

పట్నం నరేందర్‌రెడ్డి చాలా సున్నితమైన మనస్సు కలిగిన వ్యక్తి అని.. ఆయన నిరంతరం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని దుద్యాల ఎన్నికల ఇన్‌చార్జి లింగంపల్లి కిషన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో రాముడిలా సౌమ్యుడైన నరేందర్‌రెడ్డి కావాలా..? బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ రాక్షసుడిలా ప్రవరిస్తున్న రేవంత్ కావాలో ప్రజలే ఆలోచించాలన్నారు. రేవంత్ ఎక్కడ ఉంటే అక్కడ అరాచకం, శాంతిభద్రతలకు భంగం కలుగుతుందన్నారు. రేవంత్, చంద్రబాబు కోవర్టు అని పేర్కొన్నారు. ఓటర్లను భయపెట్టి దొడ్డిదారిలో గెలిచేందుకే దాడులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమంతోపాటు వ్యవసాయం వంటి పలు రంగాలు ఆగమవుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి రాముడి లాంటి నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

## కాంగ్రెస్ గూండాల దౌర్జన్యం..



కోస్గి మండలంలోని సర్జఖాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ గూండాలు రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. దాడికి నిరసనగా రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అని నినాదాలు చేయగా ఒక్కసారిగా కాంగ్రెస్ వర్గీయులు మళ్లీ రాళ్లదాడికి దిగారు. కాంగ్రెస్ వర్గీయులు ముందస్తు పథకం ప్రకారమే దాడి చేసినట్లుగా అనిపిస్తున్నది.

**– కొంద్రు విజయ్‌కుమార్, 16వ వార్డు, కోస్గి**

## బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి..



శాంతియుతంగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిలో చాలా మందికి దెబ్బలు తగిలాయి. ఈ ఘర్షణలో స్థానికులు కూడా రాళ్ల దాడికి గురయ్యారు. హస్తం పార్టీ వారు కావాలనే దాడి చేశారు. రాళ్లు, కర్రలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు. గతంలో ఇలాంటి ఘటన ఒక్కటీ జరుగలేదు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. **-మైబు, నాల్గోవార్డు (సంపల్లి) కోస్గి**

## కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలి..



ఎన్నికల్లో అన్ని పార్టీల వారు తమ అభ్యర్థుల తరపున ప్రచారం చేసుకోవచ్చు. కానీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ శ్రేణులు ఎక్కడ ప్రచారం చేసినా అక్కడ అడ్డుకుంటున్నారు. అడ్డుకోవడమే కాకుండా రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడడం చాలా బాధాకరం. రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాతే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రజలను భయపెట్టేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

**-లక్ష్మణ్, ఎమ్మెల్యే డ్రైవర్**

బాధితుడు విజయ్‌కుమార్‌ను ఇంటికెళ్లి పరామర్శిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి



## బాధితులకు మంత్రి మహేందర్‌రెడ్డి పరామర్శ

కోస్గి మండల కేంద్రంలోని సర్జఖాన్‌పేట, కోస్గి మున్సిపల్ కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం చాలా బాధాకరమని మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన దాడిలో గాయపడిన బాధితుల ఇండ్లకు వెళ్లి వారిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొడంగల్ చరిత్రలో రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాతే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలతో ప్రజలు విసిగిపోయారని.. పోలింగ్ రోజును ఆ పార్టీకి సరైన బుద్ధి చెబుతారన్నారు. కోస్గి పట్టణంలో కొంద్రు విజయ్‌కుమార్, లక్ష్మారెడ్డితోపాటు సంపల్లి గ్రామంలోని మైబు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# కాంగ్రెస్, బీజేపీలకు చోటులేదు

**బీఆర్‌ఎస్ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

ఆమనగల్లు(మాడ్గుల), నవంబర్ 15: రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు చోటులేదని.. ఆ పార్టీలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని.. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్‌ఎస్ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం మాడ్గుల మండలంలోని పాత బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 30 మంది కాం గ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి.. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిచేలా చూడా లన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉందన్నారు.



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు



## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

మహారాష్ట్రలోని థానే జిల్లాలో జరుగనున్న జాతీయ స్థాయి లంగిడి పోటీలకు ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు స్పందన, స్వాతి, శివాణి ,విజయ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, పీఈటీ సుశీల తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

**-ఆమనగల్లు, నవంబర్ 15**